సాక్షి ఆదిలాబాద్

7

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025

కబడ్డీ.. కబడ్డీ

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 71వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా ఆయా జిల్లాలకు చెందిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. - 8లో▸



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఆదిలాబాద్ క్రీడాకారులు

న్యూస్‌రీల్

కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: నర్సింగ్ విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లోని నర్సింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సీనియర్స్ మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, సూపరింటెండెంట్ రమాదేవి, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తాటిపల్లి రాజు



రాజును సన్మానిస్తున్న బ్రహ్మానంద్

తాంసి: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా తాంసి మాజీ జెడ్పీటీసీ తాటిపల్లి రాజు నియమితుడయ్యాడు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్ మంగళవారం నియామక పత్రం అందజేశాడు.

గడువు పొడిగింపు

ఆదిలాబాద్‌రూరల్: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు గడువు ఈ నెల 6 వరకు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ లలితా కుమారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



పీడీపీఎస్..

ఆదిలాబాద్ మార్కెట్ యార్డు

ఈ సీజన్‌లో లేనట్టే!

- చివరి దశకు పత్తి కొనుగోళ్లు
- ఇంకా కొలిక్కిరాని పైలట్ ప్రాజెక్ట్ అమలు తీరు
- వచ్చే సీజన్‌లోనే అంటున్న అధికారులు

సాక్షి,ఆదిలాబాద్: పత్తి కొనుగోళ్ల పరంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారని భావించిన ధర లోటు చెల్లింపు పథకం (పీడీపీఎస్) ఈ సీజన్‌లో ఇక లేనట్టే అని తెలుస్తోంది. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లు చివరి దశకు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా జిల్లాలో ఈ సీజన్ నుంచి అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు ప్రచారం సాగింది. అయితే ఇప్పటివరకు కొలిక్కి రాలేదు. వచ్చే సీజన్‌లో అమలయ్యే అవకాశాలున్నట్లు మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు.

ధర లోటు చెల్లింపు పథకం..

ప్రైజ్ డెఫిషియెన్సీ పేమెంట్ స్కీమ్ (పీడీపీఎస్) అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. పత్తి దిగుబడులను మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులకు రైతులు విక్రయించినప్పుడు ఎంఎస్‌పీ కంటే తక్కువ ధర లభించినప్పుడు ఆ లోటు ధరను కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా చెల్లించడమే ఈ పథకం ఉద్దేశం. దీన్ని రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ సీజన్ నుంచే అమలు చేసే విషయంలో ముంబై, హైదరాబాద్‌లో సమావేశాలు కూడా జరిగాయి. అయితే చివరికి ఏ అంశం కొలిక్కి రాకపోవడం, మళ్లీ సమావేశాలు నిర్వహించకపోవడం, సీజన్ చివరి దశకు రావడంతో ఇక ఇప్పట్లో ఇది లేనట్టేనని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. గతేడాది డిసెంబర్ చివరి వారంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ వరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ డైరెక్టరేట్ పరిధిలోకి వచ్చే జిల్లా మార్కెటింగ్ అధికారులు, కొన్ని పెద్ద పెద్ద మార్కెట్ యార్డుల సెక్రెటరీలు పాల్గొన్నారు. ప్రధానంగా జనవరి నుంచి ఈ స్కీమ్‌ను అమలు చేసే పరిస్థితి ఉందా.. లేదా అనే అంశంలో జాయింట్ డైరెక్టర్ అప్పట్లో చర్చించారు. అంతకుముందు మొదట్లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీమ్‌ను తెలంగాణలోని ఆదిలాబాద్ ఏఎంసీలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసే విషయంలో పరిశీలన చేయాలని రాష్ట్ర మార్కెటింగ్ అధికారులను కోరింది. అయితే ఇప్పటికిప్పుడే అమలు కష్టమని రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు కేంద్రానికి సమాచారం ఇచ్చినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఈ విషయంలో ఎలాంటి ప్రకటన లేకపోవడంతో మార్కెటింగ్ అధికారులు కూడా గట్టిగా ముందుకు వెళ్లనట్టు తెలుస్తోంది.

అమలు చేసి ఉంటే..

ప్రస్తుత కొనుగోళ్ల సీజన్‌లో పత్తి క్వింటాలుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర రూ.7,421(సీసీఐ రూ.100 తగ్గించిన తర్వాత). ప్రైవేట్‌లో మాత్రం రూ.7వేలు మించి రైతుకు దక్కడం లేదు. పీడీపీఎస్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఉంటే.. రైతులు మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయించాల్సి వచ్చేది. ఆ పత్తికి ఒకవేళ మద్దతు ధర లభించని పక్షంలో ధర లోటు కింద మిగులును కేంద్ర ప్రభుత్వం సీసీఐ ద్వారా చెల్లించేది. తద్వారా రైతుకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేది.

సందిగ్ధానికి కారణాలు ఇవే..

పైలెట్ ప్రాజెక్ట్‌గా ఆదిలాబాద్ ఏఎంసీలో అమలు చేయాలని కేంద్రం భావించినప్పటికీ రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు అమలులో ఇబ్బందులు ఉన్నాయని పేర్కొనడంతో ఈ సీజన్‌లో ఇది కొలిక్కి రాలేదు. ప్రధానంగా మార్కెటింగ్ అధికారులు ముందుకు రాకపోవడానికి పలు కారణాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ ఏఎంసీ పరిధిలో తలమడుగు, తాంసి, భీంపూర్, మావల, ఆదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్‌అర్బన్ మండలాలు ఉన్నాయి.

ఒకవేళ అమలై ఉంటే..

ఆదిలాబాద్ ఏఎంసీ మార్కెట్ పరిధిలో కేవలం 17 జిన్నింగ్‌లు మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తున్నాయి. ఒకవేళ పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలై ఉంటే.. పత్తి కొనుగోళ్ల పరంగా సీసీఐ నామమాత్రం అయ్యేది. వ్యాపారులే పత్తిని కొనుగోలు చేయాల్సి వచ్చేది. మార్కెట్లో రోజువారీగా ఉన్న ధరను వారు చెల్లించేవారు. లోటు ధరను సీసీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు చెల్లించేది. అయితే ఆదిలాబాద్ ఏఎంసీ పరిధిలో కేవలం ఆరు మండలాల నుంచి వచ్చే పత్తిని మాత్రమే జిన్నింగ్‌లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ మండలాల నుంచి చాలా తక్కువ పత్తి వస్తుందని మార్కెటింగ్ అధికారులు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశారు. తద్వారా అమలులో లోటుపాట్లు పరిశీలనకు అంతగా ఉపయుక్తంగా ఉండదని పేర్కొన్నారు. అంతేకాకుండా సీసీఐ ప్రస్తుతం రైతులకు ఆన్‌లైన్‌లో బ్యాంక్ అకౌంట్లకు డబ్బులను చెల్లిస్తుంది. ఆదిలాబాద్ మార్కెట్లో వ్యాపారులు మాత్రం ఆన్‌లైన్‌లో చెల్లించే పరిస్థితి లేదని మార్కెటింగ్ అధికారులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తద్వారా చెల్లింపుల్లో సమస్య వస్తుందని వివరించారు. అంతే కాకుండా బేల్స్, పత్తి గింజలకు మార్కెట్లో ధర తక్కువగా ఉన్నప్పుడు వ్యాపారులు పత్తి కొనుగోళ్ల పరంగా మధ్యలో బంద్ పెట్టే పరిస్థితి కూడా తలెత్తుతుందని దృష్టికి తెచ్చారు. అలాంటి పరిస్థితుల్లో రైతుల నుంచి ఆందోళనలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. ఈ విషయంలో మలివిడత సమావేశం నిర్వహించి నిర్ణయానికి వద్దామని కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ సమావేశంలో ఆదిలాబాద్ ప్రాంతానికి చెందిన ట్రేడర్లు, రైతు సంఘాల నాయకులు పాల్గొనేలా చూడాలని చెప్పారు. అయితే ఈ సమావేశం నిర్వహణలో ముందడుగు పడకపోవడం, ఇటు పత్తి కొనుగోళ్లు కూడా చివరి దశకు చేరుకోవడంతో ఇక ఈ సీజన్‌లో అమలు లేనట్టేనని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

వచ్చే సీజన్‌లో ఉంటుందేమో..



పైలెట్ ప్రాజెక్ట్ అమలులో ఎలాంటి నిర్ణయం జరగలేదు. ఈ సీజన్‌లో ఇక ఉండకపోవచ్చు. వచ్చే సీజన్‌లో ఉంటుందేమో తెలియదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికి అనుగుణంగా అది అమలులోకి వస్తుంది. ఈ విషయంలో మాకు స్పష్టత లేదు.– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్ ఏఎంసీ

డీసీసీపై తేల్చేనా..

- వారంలోగా ఖరారయ్యే అవకాశం?
- అధ్యక్ష పదవి కోసం ఆశావహుల ముమ్మర యత్నాలు

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక తుది దశకు చేరినట్టేనా.. అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది ఆ పార్టీ వర్గాల నుంచి. వారం రోజుల్లో ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనేది పార్టీలో ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికకు ముందు డీసీసీ అధ్యక్షుడి ఎంపిక తప్పనిసరి కానుంది. వాయిదా పడుకుంటూ వస్తున్న ఎంపిక వ్యవహారం ఈనెల రెండో వారంలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లా అధ్యక్షుల పేర్లు కూడా ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంలో ఎమ్మెల్యేల పేర్లనే పరిగణలోకి తీసుకుంటారా.. లేనిపక్షంలో నియోజకవర్గ ఇన్‌చార్జీలలో ఎవరికైనా అవకాశం కల్పిస్తారా.. అలా కాకుండా పార్టీలో సీనియర్ నేతలను ఎంపిక చేస్తారా అనే విషయంలో తర్జనభర్జన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

ఎవరికి దక్కేనో..

జిల్లా అధ్యక్ష పదవి కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోక గణేశ్‌రెడ్డి రేసులో ఉన్నప్పటికీ పార్టీ ఎవరిపై భరోసా ఉంచి హోదా కేటాయిస్తుందోనని కార్యకర్తలు ఆసక్తిగా గమనిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకే ఈ పదవి కేటాయించిన పక్షంలో జిల్లాలో వెడ్మ బొజ్జుకే దక్కే అవకాశాలు ఉన్నాయి. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన కంది శ్రీనివాసరెడ్డి తన ప్రయత్నాలు మరింత ముమ్మరం చేశారు. పార్టీ పెద్దలు కూడా ఆయన వైపు ఆసక్తి కనబర్చుతున్నట్లు ప్రచారం ఉంది. అలా కాకుండా పార్టీలో సీనియర్ నేతలను పరిగణలోకి తీసుకుంటే మాత్రం శ్రీకాంత్ రెడ్డి లేనిపక్షంలో గణేశ్ రెడ్డిలలో ఎవరికైనా దక్కే అవకాశాలు ఉన్నాయి.

స్థానిక ఎన్నికలకు ముందు..

స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. అంతకుముందే పార్టీ రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లా అధ్యక్షుల ఎంపికను కూడా ఏర్పాటు పూర్తి చేయాలని భావిస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లకు సంబంధించి ఎన్నికల్లో పార్టీ పరంగా పోటీ చేసేవారికి బి–ఫామ్‌లను డీసీసీ అధ్యక్షుడి చేతుల మీదుగానే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ ఎంపికను వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పతంగే బ్రహ్మానందంను కమలం పార్టీ మరోసారి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ కూడా డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిసింది.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- కలెక్టర్ రాజర్షిషా
- ఖైర్డాట్వాలో ఇప్పపువ్వు లడ్డూ తయారీ యూనిట్ ప్రారంభం



ఇప్పపువ్వు లడ్డూ రుచి చూస్తున్న కలెక్టర్ రాజర్షిషా

నార్నూర్: ఎస్‌హెచ్‌జీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని ఖైర్డాట్వా గ్రామంలో ఐకేపీ సహకారంతో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఇప్పపువ్వు (మహువ) లడ్డూల తయారీ యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు యూనిట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్‌లో ఇప్పపువ్వు లడ్డుకు మంచి డిమాండ్ ఉందన్నారు. మార్కెటింగ్ చేస్తే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కాగా, రైతు మిత్ర సంఘంలో కొనుగోలు చేసిన పంటలను నిల్వ ఉంచేందుకు గోదాములు లేక ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నాబార్డు సహకారంతో నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సీహెచ్‌సీ తనిఖీ

అనంతరం మండల కేంద్రంలోని సీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్‌ను పరిశీలించారు. అవసరమైన సిబ్బందిని త్వరగా నియమించి ప్రారంభించాలని డీఎంహెచ్‌వో నరేందర్‌ను ఆదేశించారు. అలాగే ప్రసూతివార్డు, స్కానింగ్ యూనిట్లను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సాధారణ కాన్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డీఆర్డీవో రాథోడ్ రవీందర్, తహసీల్దార్ జాడి రాజలింగు, ఎంపీడీవో జవహర్‌లాల్, ఏపీఎం రమేశ్, సీసీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సాధించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు.

‘సంక్షేమ’ం.. మాకెప్పుడో?

- మున్సిపల్ పరిధిలో ఇంకా షురూ కాని పథకాలు
- వార్డుసభల్లో పూర్తయిన అర్హుల గుర్తింపు
- ప్రారంభంపై మాత్రం స్పష్టత కరువు
- ఎంపికైన వారికి తప్పని నిరీక్షణ



వార్డుసభ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన నాలుగు సంక్షేమ పథకాల అమలు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభం కాగా పట్టణ పరిధిలో ఇంకా షురూ కాలేదు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారితో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఇటీవల క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. వార్డు సభలు నిర్వహించి ఆయా పథకాలకు అర్హులైన వారిని గుర్తించి ఆమోదం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామం యూనిట్‌గా జిల్లాలోని 17 గ్రామాల్లో ఆయా పథకాలను ప్రారంభించారు. ఇందులో రైతు భరోసా నిధులు ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాగా మిగతా మూడు పథకాలకు సంబంధించి మంజూరు పత్రాలను అందజేశారు. అయితే ఆదిలాబాద్ పట్టణ పరిధిలో మాత్రం ఆయా పథకాలను ఇంకా ప్రారంభించలేదు. ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే దానిపై కూడా స్పష్టత లేదు. దీంతో ఎంపికైన వారు ప్రభుత్వ నిర్ణయంపై గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

లబ్ధిదారుల ఎంపిక .

ప్రభుత్వం మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు వంటి పథకాలను మాత్రమే అమలు చేసింది. వీటి కోసం ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల ఆధారంగా ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ‘360 డిగ్రీల’ ఆధారంగా పరిశీలించి అర్హులైన వారి జాబితాను జిల్లాకు పంపించింది.ఈ మేరకు మున్సిపల్ పరిధిలో గత నెల 16 నుంచి 20వరకు బల్దియా ఉద్యోగులు, సిబ్బంది అర్హుల గుర్తింపు కోసం సర్వే చేపట్టారు. ప్రతీ దరఖాస్తుదారుని సమాచారం సమగ్రంగా సేకరించారు. ఆన్‌లైన్ లోనూ డేటాను పొందుపర్చారు. ఇందులో లబ్ధిదారులను ఎంపిక చేసేందు కోసం 21నుంచి 23వరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో సభలు నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బల్దియా అధికారులు, కాలనీవాసుల సమక్షంలో అర్హులైన వారి జాబితాను చదివి వినిపించారు. ఆ రెండు పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే పట్టణ పరిధిలో ఆయా పథకాలను ఎప్పటి నుంచి అమలు చేస్తారనేదానిపై స్పష్టత కరువైంది.

కొత్తగా 13,932 దరఖాస్తులు

ఇటీవల నిర్వహించిన వార్డుసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. రేషన్ కార్డుల కోసం 8,353, ఇందిరమ్మ ఇళ్ల కోసం 5,579 దరఖాస్తులు అందాయి. వాటి వివరాలను బల్దియా సిబ్బంది ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఇందులో అర్హుల గుర్తింపు కోసం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాల్సి ఉండగా ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే వీరికి కూడా ఇది వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులతో పాటే ఆయా పథకాలను అమలు చేస్తారా లేక పరిశీలన కోసం మళ్లీ ప్రత్యేకంగా ఏదైనా కార్యక్రమం చేపడుతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో..

వార్డులు : 49
ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు : 20,350
ఇంటి స్థలం లేని వారు : 12,033
ఇంటిస్థలం కలిగి పక్కా ఇళ్లులేని వారు : 8,317
ఎంపికైన రేషన్ కార్డు లబ్ధిదారులు: 3,012
వార్డు సభల్లో అందిన దరఖాస్తులు : 13,932

దరఖాస్తు చేసి నాలుగేళ్లయింది



మాది నిరుపేద కుటుంబం. పనిచేస్తేనే పూట గడుస్తది. రేషన్ కార్డు కోసం నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటి వరకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఆహారభద్రత కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో సంతోషపడ్డాం. ప్రస్తుతం గ్రామాల్లో ఇస్తున్నారట.. ఇక్కడ మాత్రం ఇంకా మొదలు పెట్టలేదు. త్వరగా అందజేయాలని కోరుతున్నాం.

– హన్‌కారే మీనాక్షి, గాంధీనగర్

ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలి



మాది నిరుపేద కుటుంబం. కులవృత్తిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇస్తామని ప్రకటించడంతో దరఖాస్తు చేశాం. ఇటీవల వార్డుసభలో ప్రకటించిన జాబితాలో చోటు దక్కింది. అయితే ఎప్పుడిస్తరో తెలువట్లేదు. తొలి విడతలోనే ప్రాధాన్యం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాం.

– మైలారం రాజేశ్, సరస్వతినగర్

ఎలాంటి ఆదేశాలు రాలేదు

పట్టణంలోని ప్రతీ వార్డులో ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం లబ్ధిదారులను ఎంపిక చేశాం. అయితే వాటి అమలు ఎప్పటి నుంచి అనే దానిపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన తహసీల్దార్ల ఆధ్వర్యంలో కొనసాగుతుంది. వార్డుసభల్లో అందిన దరఖాస్తుల సమాచారాన్ని ప్రజాపాలన వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నాం. వీటిపై కూడా ప్రభుత్వమిచ్చే ఆదేశాలకనుగుణంగా ముందుకు సాగుతాం.

– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

- ప్రధాన కార్యదర్శిగా జేఆర్ చౌహాన్



ప్రధాన కార్యదర్శి జేఆర్ చౌహాన్‌తో సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. తొలుత సభ్యులను ఎన్నుకుని అనంతరం వారి నుంచి ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర హోదాలకు కార్యదర్శులను ఎన్నుకున్నారు.

ఎన్నికల నిర్వహణ..

శాశ్వత కార్యనిర్వాహక సభ్యులుగా కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ, ఆర్డీవో వ్యవహరిస్తున్నారు. మరో ఎనిమిది మంది కార్యనిర్వాహక సభ్యులను పోలింగ్ ద్వారా ఎన్నుకున్నారు. దీని కోసం ఇదివరకే నోటిఫికేషన్ ఇవ్వగా, మంగళవారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఎన్నికలు నిర్వహించారు. 13 మంది బరిలో నిలవడంతో ఓటింగ్ తప్పనిసరిగా మారింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. జిల్లా సహకార అధికారి మోహన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. 350 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అత్యధిక ఓట్లు వచ్చిన ఎనిమిది మందిని మొదట కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అందులో నరేష్ కుమార్ జోషి, ఎల్టీ ఓంప్రకాశ్‌రెడ్డి, లోక ప్రమోద్ రెడ్డి, నరేందర్ బండారి, జేఆర్ చౌహాన్, టి.శివప్రసాద్, యు.అనిత, ఎ.ధనుంజయ్ ఉన్నారు. వీరి నుంచి ప్రధాన కార్యదర్శి, ఇతర పోస్టుల ఎంపిక కోసం సభ్యులు సమావేశం అయ్యారు. ఆ తర్వాత నూతన కార్యవర్గాన్ని ట్రెయినీ కలెక్టర్ సన్మానించారు.

కార్యవర్గం ఇలా..

ప్రధాన కార్యదర్శి : జేఆర్ చౌహాన్
సంయుక్త కార్యదర్శి : నరేశ్ కుమార్ జోషి
స్పోర్ట్స్ కార్యదర్శి : ఎ.ధనుంజయ్
కోశాధికారి : టి.శివప్రసాద్
లైబ్రరీ కార్యదర్శి : ఎల్.ప్రమోద్ రెడ్డి
సాంస్కృతిక కార్యదర్శి : యు.అనిత
కార్యనిర్వాహక సభ్యులు : ఎల్టీ ఓంప్రకాశ్ రెడ్డి, నరేందర్ బండారి

ముగిసిన నాగోబా జాతర

మెస్రం వంశీయుల మహా పూజతో ప్రారంభమైన నాగోబా జాతర అధికారికంగా ముగిసింది. మంగళవారం కూడా భక్తులు భారీగా తరలివచ్చారు.

- 8లో▸



క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

దండేపల్లి: ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు మండల కేంద్రంలోని రెండు కిరాణాషాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అంజన్న, ఆర్‌ఐ భూమన్న మంగళవారం తనిఖీలు నిర్వహించినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. శ్రీనివాస్ కిరాణాదుకాణంలో వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి నిల్వ ఉంచిన రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. దుకాణాయజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని దండేపల్లిలోని షాప్ నంబర్ -14లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

దహెగాం: మండలంలోని బొర్లకుంట గ్రామానికి చెందిన లొనారె సత్యనారాయణ, అతడి కుమారులు సాయి, ప్రసాద్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన డొంగ్రె తిరుపతిపై సత్యనారాయణ, అతడి ఇద్దరు కుమారులు గొడ్డలి కామతో దాడి చేశారు. అడ్డుగా వచ్చి ఆపే ప్రయత్నం చేసిన అతడి భార్య హేమలతను కూడా గాయపరిచి చంపుతామని బెదించారు. తిరుపతి ఫిర్యాదు మేరకు మంగళవారం ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు జైలు

రెబ్బెన: ఒకరి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు ఆరునెలల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ అడిషనల్ జేఎఫ్‌సీఎం జక్కుల అనంతలక్ష్మి తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన జంజిరాల తిరుపతి (42), అతడి భార్య, పిల్లలతో కలిసి 2020, డిసెంబర్ 20న కాగజ్‌నగర్‌లోని ఈస్‌గాంకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. రెబ్బెన మండలం వంకులం సమీపంలో ఎదురుగా కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి వస్తున్న కారును డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా తిరుపతి నడుపుకొంటూ వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తిరుపతి, అతడి భార్య, పిల్లలకు తీవ్రగాయాలయ్యాయి. తిరుపతిని మెరుగైన వైద్యం కోసం ముందుగా మంచిర్యాలకు తరలించగా చికిత్స అందించారు. పరిస్థితి విషమించగా మరుసటి రోజు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే తిరుపతి మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి కమల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం ప్రస్తుత సీఐ, ఎస్సై, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలిశా, లైజన్ అధికారి రాంసింగ్, కోర్టు కానిస్టేబుల్ ఉమేశ్ సాక్షులను హాజరుపర్చారు. జడ్జి వారిని విచారించి నేరం రుజువు కావడంతో కారు డ్రైవర్ ఎండీ జాకీర్ హుస్సేన్‌కు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు శిక్షపడేలా కృషి చేసిన డీఎస్పీ చిత్తరంజన్, సీఐ, ఎస్సైని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణపురం, ముత్తుట్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

WANTED

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

లాభాల అజొల్లా



లంబడిపల్లిలో తొట్టిలో పెరుగుతున్న అజొల్లా

- బహుళ ప్రయోజనకారిగా గుర్తింపు
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- ఈజీఎస్ కింద రైతులకు సాయం

చెన్నూర్‌రూరల్: అజొల్లా సాగుతో అనేక లాభాలున్నాయి. నాచు జాతికి చెందిన ఇది బహుళ ప్రయోజనకారిగా గుర్తింపు పొందింది. వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు, నీరు వృథా కాకుండా ఉండేందుకు, భూగర్భ జలాల పెంపునకు తోడ్పడుతోంది. సేంద్రియ సాగుకు ఉపయోగించడంతోపాటు చేపలు, కోళ్లకు మంచి దాణగా అందించవచ్చు. ప్రభుత్వం మంచిర్యాల జిల్లాకు 27 యూనిట్లు మంజూరు చేసింది. బోర్ల రీచార్జ్ కోసం రూ.7,83లక్షలు, అజొల్లాను పెంచేందుకు అవసరమైన 81 నీటితొట్ల నిర్మాణానికి రూ.7,83లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఉపాధిహామీ జాబ్‌కార్డున్న రైతులు వీటిని ఏర్పాటు చేసుకున్నాక నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. జిల్లాలో ఇప్పటికే 12 బోర్లు రీచార్జ్ పూర్తి చేసుకున్నాయి. బెల్లంపల్లి, భీమారం, చెన్నూర్, దండేపల్లి, హాజీపూర్, జన్నారం, కన్నెపల్లి, లక్సెట్టిపేట, తాండూర్, వేమనపల్లి మండలాల్లో ఒక్కొక్కటి పూర్తయ్యాయి. నెన్నెలలో మాత్రం రెండింటిని పూర్తి చేశారు.

వరికి ప్రయోజనకారిగా..

అజొల్లా వాతావరణంలోని నత్రజనిని వేళ్ల ద్వారా నేలలో స్థిరీకరిస్తుంది. పొలంలో వరి నాటు వేశాక వారం రోజులకు వేస్తే కలుపు మొక్కలు పెరగకుండా అరికడుతుంది. ఇది యూరియాతో సమానంగా పని చేస్తుంది. వరి నాటు వేసిన 15రోజుల్లో ఎకరానికి 20గ్రాముల నుంచి 40 గ్రాముల వరకు అజొల్లాను తీసుకుని పంటలో అక్కడక్కడా నీటిలో చల్లుకోవాలి. వరి పంటలో నీటిపై చల్లిన అజొల్లా 15 నుంచి 20 రోజుల్లో వృద్ధి చెందుతుంది. వరి పంటలో హెక్టార్‌కు 50కిలోల నత్రజనిని పంటకాలంలో స్థిరీకరిస్తుంది. తద్వారా ఒక హెక్టార్‌కు 30కిలోల నత్రజనిని తగ్గించుకోవచ్చు. అజొల్లా వాడకం ద్వారా 20శాతం తక్కువ పెట్టుబడితో 20శాతం అధికంగా పంటల దిగుబడి పొందవచ్చు. వరి పొలాల్లో నాచులాగా నీటి ఉపరితలంపై కార్పెట్‌లాగా పరుచుకుపోవడం వలన నీరు ఆవిరి కాకుండా నీటి మట్టాన్ని తగ్గకుండా చేస్తుంది.



లంబడిపల్లిలో బోరు రీచార్జ్‌కు తవ్విన గుంత

పశుగ్రాసంగా కూడా..

అజొల్లా పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుంది. ఇందులో 20శాతం ప్రొటీన్లు, 10-15శాతం మినరల్స్, 10-20శాతం అమైనో ఆస్పిడ్‌ను పశువులకు అందిస్తుంది. పశువులకు మేతగా అజొల్లాను వేస్తే పాల ఉత్పత్తి 15-20శాతం వరకు పెరుగుతుంది. పశువులను ఆరోగ్యంగా ఉంచి పాలలో వెన్న శాతం పెరిగేలా చూస్తుంది. పచ్చి అజొల్లాను చేపలు, కోళ్లు, మేకలకు ఆహారంగా కూడా అందించవచ్చు. ఎండిపోయిన అజొల్లాను పశువుల దాణగా ఉపయోగించవచ్చు. అజొల్లాను విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చు.

సాగు విధానం ఇలా..

బోరు చుట్టూ ఏడున్నర ఫీట్ల వెడల్పు, ఏడున్నర ఫీట్ల లోతుగా గుంత తవ్వాలి. అందులో మొదటగా దొడ్డు కంకర, తర్వాత కొంచెం సన్నటి కంకర, తర్వాత చిప్స్ వేయాలి. పరిసర ప్రాంతంలో పడే వర్షపు నీరు, ఇతర నీరు బోరు వద్దకు వచ్చేలా కాలువ తీసుకోవాలి. ఇలా చేయడంతో నీరంతా అందులోకి వెళ్తుంది. వేసవిలోనూ బోరులో పుష్కలంగా నీరుంటుంది. బోరు రీచార్జ్ అవుతుంది. అజొల్లా పెంపకానికి 10-15 సెంటీమీటర్ల లోతు స్వచ్ఛమైన నీటి తొట్టి అవసరం. 10 గ్రాములు లేదా 20 గ్రాముల అజొల్లాను ఒక నీటి తొట్టిలో వేసి నీడ పట్టున ఉంచాలి. దీంతో 15రోజుల్లో అభివృద్ధి చెందిన అజొల్లా తొట్టి మొత్తం కార్పెట్‌లాగా నీటిపై పరుచుకుపోతుంది.

చాలా లాభాలున్నాయి



నాలుగెకరాల మామడి తోటలోని నా బోరును రీచార్జ్ చేయించాను. మూడు నీటితొట్లు నిర్మించుకున్నాను. ఇందుకు సర్కారు సాయమందించింది. రూ.400కు కిలో చొప్పున అజొల్లా కొనుగోలు చేసి తెచ్చి సాగు చేశాను. ఆశాజనకంగా ఉంది. దీన్ని సాగు చేస్తే చాలా లాభాలున్నాయి.

– మద్ద మధు, రైతు, లంబడిపల్లి

సద్వినియోగం చేసుకోవాలి



భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రీచార్జ్ బోర్ల ఏర్పాటుకు రూ.29వేలు ఇస్తోంది. నీటితొట్ల నిర్మాణానికి మరో రూ.29వేలు అందజేస్తోంది. నిర్మాణాలు పూర్తయిన తర్వాత డబ్బులు నేరుగా ఖాతాలో జమవుతాయి. జాబ్‌కార్డున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కిషన్, డీఆర్డీవో, మంచిర్యాల

‘చెత్త’శుద్ధి ఎలా?





స్నానఘట్టాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

- బాసరలో అంతా అపరిశుభ్రం
- పేరుకుపోయిన చెత్తాచెదారం

భైంసా: బాసరలో పారిశుధ్యం లోపించింది. ఇక్కడి శ్రీజ్ఞానసరస్వతీ ఆలయంలో మూడురోజులుగా నిర్వహించిన వసంత పంచమి వేడుకల అనంతరం ఈ పరిస్థితి తలెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి 1.20లక్షల మంది భక్తులు రాగా, సరిపడా ఏర్పాట్లు చేయలేదనే విమర్శలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే రామారావుపటేల్ కలుగజేసుకుని పార్టీ శ్రేణులతో కలిసి శ్రమదానంతో స్నానఘట్టాలతోపాటు ఇతర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఇపుడు ఉత్సవాలు ముగిశాక ఎటు చూసినా అంతా అపరిశుభ్రమే. ఆలయ అధికారులు పారిశుధ్య నిర్వహణను విస్మరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అన్ని మార్గాల్లో అంతే..

బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, ప్రధాన రోడ్లు, ఆలయ ప్రాంగణం, పార్కింగ్ స్థలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉన్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని పదేపదే చెప్పే అధికారులు ఉత్సవాల్లో భక్తులకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. పైగా, దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా చర్యలు తీసుకోలేదు. ఆలయ సిబ్బందే ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారనే విమర్శలున్నాయి. పూజాద్రవ్యాలను కూడా ప్లాస్టిక్‌లోనే విక్రయిస్తున్నా పట్టింపు కరువైందని భక్తులు ఆరోపిస్తున్నారు.

నదీ జలం కలుషితం

ఇప్పటికీ స్నానఘట్టాల వద్దే పూజాద్రవ్యాలు, ఇతర వ్యర్థాలు కనిపిస్తున్నాయి. ఆలయ సిబ్బంది వీటిని తొలగించడంలో విఫలమయ్యారు. గోదావరి నదిలో నీటి కాలుష్యం జరగకుండా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాల్సి ఉండగా దీనినీ విస్మరించారు. కేంద్ర జలవనరుల సంఘం గతంలోనే రాష్ట్ర పరిధిలో గోదావరి నదీ జలాలు కలుషితమవుతున్న పరిస్థితిపై నమూనాలు సేకరించిన విషయం తెలిసిందే. నది నీటిని కలుషితం కాకుండా చూడాలని అప్పట్లోనే అధికారులు ఆదేశించారు. అయినా ఆలయ అధికారుల్లో స్పందన లేదు. పక్కనే ట్రిపుల్ ఐటీ కళాశాల ఉండగా ఇందులో చదువుకునే ఏడువేల మంది విద్యార్థులకు తాగునీటిని అందించే చెరువుకు గోదావరినది నుంచే నీటిని తరలిస్తారు. ఇక్కడి గోదావరి నది నుంచే నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ఎంతోమందికి తాగునీరు అందించే గోదావరి నదీ జలాలు కలుషితం కావడాన్ని అధికారులు అరికట్టడంలేదు. వీరు తీరుపై భక్తులతోపాటు స్థానికులూ అసహనం వ్యక్తంజేస్తున్నారు.

రెండో రోజు మూడు నామినేషన్లు

- పట్టభద్రులకు 2, ఉపాధ్యాయ స్థానానికి ఒకటి
- 12కు చేరిన నామినేషన్ల సంఖ్య

కరీంనగర్ అర్బన్: కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు నామినేషన్ పత్రాలను కలెక్టర్ పమేలా సత్పతికి అందించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామానికి చెందిన వేముల కరుణాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వెంకటేశ్వరపల్లికి చెందిన పిడిశెట్టి రాజు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేశారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఇన్నారెడ్డి తిరుమల్‌రెడ్డి నామినేషన్ వేశారు. రెండ్రోజుల్లో 8 మంది గ్రాడ్యుయేట్ స్థానానికి, నలుగురు టీచర్ స్థానానికి నామినేషన్ వేశారు. గ్రాడ్యుయేట్, టీచర్ స్థానాలకు కలిపి మొత్తం 12మంది అభ్యర్థులు 16 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

ఓసీ యత్నం విరమించుకోవాలి

- మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బెల్లంపల్లి శాంతిఖని పాత గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నాలను సింగరేణి సంస్థ విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్ బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో స్పష్టం చేశారు. శాంతిఖని గనిని ఓపెన్‌కాస్ట్‌గా మారిస్తే పరిసర గ్రామాలైన ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి, సుబ్బారావుపల్లె, లింగాపూర్, శ్రావణపల్లి, బత్వాన్‌పల్లె గ్రామాలతో పాటు బెల్లంపల్లి పట్టణం విధ్వంసానికి గురవుతుందని తెలిపారు. వ్యవసాయ వనరులు దెబ్బతింటాయని, జలవనరులు అడుగంటుతాయని, వన్య ప్రాణులు అంతరించి పోతాయని పేర్కొన్నారు. ప్రజలు నిర్వాసితులుగా మారి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఓసీపీలు ఏర్పాటు చేసిన ప్రాంతాలు ఎక్కడా అభివృద్ధికి నోచుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. నిర్వాసితులను అనాధిగా సింగరేణి యాజమాన్యం ప్రభుత్వాల అండతో మోసగిస్తూనే ఉందని ఆరోపించారు. సింగరేణి మోసపూరిత మాటలు నమ్మకుండా పర్యావరణ పరిరక్షణ, గ్రామ, పట్టణ పరిరక్షణ, వ్యవసాయ భూముల సంరక్షణ కోసం ఓసీపీ విధ్వంసాన్ని వ్యతిరేకించేలా ప్రజలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. శాంతిఖని ఓసీపీని నిలిపివేయడానికి అధికార పార్టీ ఎమ్మెల్యే వినోద్, ఎంపీ వంశీ బాధ్యతగా చొరవ చూపాలని, లేనిపక్షంలో వీరితో పాటు కాంగ్రెస్ మండల, పట్టణ నాయకులకు ప్రజల చేతిలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలను వేర్వేరుగా తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా అభ్యసన సామర్థ్యాలతో పాటు పదో తరగతి విద్యార్థుల వందరోజుల ప్రణాళిక అమలు తీరు తెలుసుకున్నారు. పీవో ప్రత్యేకంగా రూపొందించిన యంగ్ ఓరియేటెడ్ క్లబ్ కార్యక్రమంతో పాటు స్కిట్స్ రోల్ ప్లే యాక్టివిటీస్ గురించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చదువులో విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో ఉపాధ్యాయులను అభినందించారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి స్కిట్స్‌ను పరిశీలించారు. పాఠశాలల పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. విధిగా మెనూ పాటించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ఎంఏ గఫార్, కాంతారావు, వార్డెన్లు బలిరాం, గోవింద్ తదితరులున్నారు.

వరుస చోరీల నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: పట్టణంలోని పలు ఆలయాల్లో వరుస చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్‌కు చెందిన విజయ్ సింధే మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బలరాంపూర్‌లో ఉంటున్నాడు. అతడు జల్సాలకు అలవాటు పడి భైంసాలోని నర్సింహాలయం, పులేనగర్ హనుమాన్ ఆలయం, కైలాస్ జిన్నింగ్‌లోని బాలాజీ ఆలయం, సంతోషీమాత ఆలయంతోపాటు ఓ వైన్స్‌లో చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి 3.150 కిలోల వెండి, మూడు మాసాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీఐ గోపీనాథ్, ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీలు ప్రమోద్, హరిబాబు, అంబదాస్, సుభాష్, శివరాజ్, శరత్‌చంద్ర, డబ్ల్యూ పీసీలు అనిత, సంగీత, హోంగార్డ్ గంగారామ్‌ను అభినందించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అవినాష్ కుమార్, ఎస్సై మహమ్మద్ గౌస్ ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



మృతుడి ఎడమ చేతిపై టాటూ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు (25) ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎడమ చేతిపై లవ్ గుర్తు కలిగి దానిపై మామా అని ఇంగ్లిష్‌లో టాటూ ఉంది. ఎత్తు 5.5, నల్లని రంగు టీ షర్ట్, ఆష్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. పూర్తి వివరాలకు 8712658596, 9849058691 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

గుండెపోటుతో ఎస్సై హఠాన్మరణం



తానాజీ (ఫైల్)

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండల పోలీస్‌స్టేషన్‌లో రెండో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న తానాజీ నాయక్ (60) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఎందా గ్రామానికి చెందిన తానాజీనాయక్ 1982 బ్యాచ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అనంతరం హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ఎస్సైగా పదోన్నతితో ఏడాదిపాటు జన్నారంలో రెండో ఎస్సైగా పనిచేశారు. తొమ్మిది నెలల క్రితం రామకృష్ణాపూర్, లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయ్యారు. ఏడు నెలల క్రితం తిరిగి జన్నారం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. నవంబర్‌లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా.. ఆ తర్వాత జన్నారం మండలం ఇందన్‌పల్లిలో ఇల్లు నిర్మించుకుని కుటుంబంతో నివాసం ఉండేందుకు భూమి కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ ఆవరణలోని క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న తానాజీ నాయక్ మంగళవారం 2.30గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. స్వగ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో ఎస్సై రాజవర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయికుంట శివారులో మంగళవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు పోలీసులు సాయికుంట శివారులోని చెట్ల పొదలపై ఆకస్మిక దాడి నిర్వహించారు. పేకాడుతున్న మంచిర్యాలకు చెందిన గడ్డం శంకరయ్య, బండి రవిని అరెస్ట్ చేయగా మరో ముగ్గురు పరారయ్యారు. వీరి నుంచి రూ.5,070 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తిరుపతికి వెళ్లి తిరిగి రాని లోకాలకు..



సిడాం చిత్రు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని రేంగన్‌వాడి గ్రామానికి చెందిన సిడాం చిత్రు (57) దైవదర్శనానికి తిరుపతికి వెళ్లి ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై పడి మృతి చెందాడు. వివరాలు.. సిడాం చిత్రు, విఠల్ రైలులో ఇటీవల దైవదర్శనానికి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై పడి చిత్రు మృతిచెందాడు. విఠల్ ఒక్కడే స్వగ్రామానికి చేరుకున్నాడు. చిత్రు విషయమై ఆయన కుటుంబీకులు విఠల్‌ను ప్రశ్నించగా తప్పిపోయినట్లు సమాధానం ఇచ్చాడు. దీంతో వారు హైదరాబాద్‌లో పోలీసులను ఆశ్రయించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై పడి మృతిచెందగా, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో ఉంచినట్లు వారు తెలిపారు. అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య ద్రుపది, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. దైవదర్శనానికి వెళ్లిన ఆయన మృతదేహంగా రావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మంగళవారం రాత్రి గ్రామంలో చిత్రు అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్సాహంగా అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

ఆదిలాబాద్: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 71వ అంతర్ జిల్లాల కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఉష్కం రఘుపతి, ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం సింథటిక్ కోర్టులపై ఖమ్మం-హైదరాబాద్, ములుగు-సూర్యాపేట జిల్లాల మధ్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీడీ హరిచరణ్, విఠల్‌రెడ్డి, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



తలపడుతున్న హైదరాబాద్, ఖమ్మం క్రీడాకారులు

ముగిసిన నాగోబా జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- రేపు ఆలయ హుండీ లెక్కింపు

ఇంద్రవెల్లి: జనవరి 28న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర అధికారికంగా ముగిసింది. మంగళవారం భక్తులు భారీగా తరలివచ్చారు. నాగోబాను దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. గురువారం ఆలయ హుండీ లెక్కింపు ఉంటుందని ఈవో రాజమౌళి తెలిపారు. జాతర అధికారికంగా ముగిసినా మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

‘కొత్త గనులను విస్మరించిన కేంద్రం’



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సింగరేణిలో కొత్తగనుల ఏర్పాటును పూర్తిగా విస్మరించిందని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు ఆరోపించారు. మంగళవారం ఆయన ఆర్కే 5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో బొగ్గు పరిశ్రమకు ఊతమిచ్చే ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను రద్దు కోసం తమ యూనియన్ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పెద్దలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని తెలిపారు. గనుల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్‌లో మెనూను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గనిలో ఉత్తమ ఉద్యోగిగా ఎంపికై గణతంత్ర వేడుకల్లో బహుమతి పొందిన ఎస్‌డీఎల్ ఆపరేటర్ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, పేరం రమేశ్, కేంద్ర కార్యదర్శి పిన్నింటి మల్లారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, చంద్రమోహన్, రాంగిశెట్టి శ్రీనివాస్ నంబయ్య, భీమ్ రవి పాల్గొన్నారు.